లక్నో సూపర్

పంజాబ్‌పై అద్భుత విజయం

రాణించిన మయాంక్, కృనాల్, పూరన్

ధవన్, బెయిర్‌స్టో పోరాటం వృథా

చేజేతులా ఓడిన కింగ్స్

లక్నో సూపర్‌జెయింట్స్ (ఎల్ఎస్‌జే) అదరగొట్టింది. రాజస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఓటమి నుంచి త్వరగానే తేరుకున్న లక్నో..మలి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించింది. సొంత ఇలాఖాలో సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ లీగ్‌లో పాయింట్ల ఖాతా తెరిచింది. డికాక్ అర్ధసెంచరీతోడు కృనాల్ పాండ్యా, పూరన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పోరాడే స్కోరు అందుకున్న లక్నో..పంజాబ్‌ను కట్టడి చేయడంలో సఫలమైంది. ధవన్, బెయిర్‌స్టో అదిరిపోయే ఆరంభాన్నిచ్చినా..తమకు అనుకూలంగా మలుచుకోలేకపోయింది. మయాంక్ ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి.. చేజేతులా మ్యాచ్‌ను చేజార్చుకుంది.

కృనాల్ (43*)

లక్నో: ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ పోటీలోకి వచ్చింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో 21 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచింది. లక్నో నిర్దేశించిన 200 పరుగుల లక్ష్యఛేదనలో పంజాబ్ 5 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు ధవన్ (70), బెయిర్‌స్టో(42) రాణించారు. అరంగేట్రం మ్యాచ్ ఆడిన మయాంక్ యాదవ్ (3/27) మూడు వికెట్లు పడగొట్టగా, మోసిన్‌ఖాన్ (2/34) రెండు వికెట్లు తీశాడు. తొలుత డికాక్(54), కృనాల్‌పాండ్యా(22 బంతుల్లో 43 నాటౌట్, 4ఫోర్లు, 2 సిక్స్‌లు), పూరన్(21 బంతుల్లో 42, 3ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ముఖ్యంగా ఆఖర్లో కృనాల్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో లక్నో భారీ స్కోరు అందుకుంది. కరాన్ (3/28), అర్ష్‌దీప్‌సింగ్ (2/30) ఆకట్టుకున్నారు. మయాంక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'దక్కింది.

ధవన్, బెయిర్‌స్టో రాణించినా:

లక్నో నిర్దేశించిన లక్ష్యఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ధవన్, బెయిర్‌స్టో అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు బౌండరీలతో విజృంభించారు. ముఖ్యంగా ధవన్ స్వేచ్ఛగా షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరిగెత్తించాడు. అయితే ప్రభ్‌సిమ్రన్(19), జితేశ్‌శర్మ(6), కరాన్(0) నిరాశపర్చడం పంజాబ్ గెలుపు అవకాశాలను దెబ్బతీసింది. తన తొలి మ్యాచ్‌లోనే మెరుపు వేగంతో మయాంక్ యాదవ్..పంజాబ్ పతనాన్ని శాసించాడు. కండ్లు చెదిరే వేగంతో పంజాబ్ వికెట్లను నేలకూల్చాడు.

పూరన్, కృనాల్ మెరుపులు:

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 199/8(డికాక్ 54, కృనాల్ 43 నాటౌట్, పూరన్ 42, కరన్ 3/28, అర్ష్‌దీప్‌సింగ్ 2/30), **పంజాబ్:** 20 ఓవర్లలో 178/5(ధవన్ 70, బెయిర్‌స్టో 42, మయాంక్ 3/27, మోసిన్2/34)

మయాంక్ (3/27)

ఓపెనర్లు డికాక్, రాహుల్ ఆశించినంత మెరుగైన శుభారంభం అందించలేకపోయారు. ఓ ఎండ్‌లో డికాక్ ఫోర్‌తో తన పరుగుల ఖాతా తెరిస్తే..రాహుల్ సింగిల్‌తో మొదలుపెట్టాడు. రాహుల్..బెయిర్‌స్టోకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ పూరన్..చాహర్‌ను లక్ష్యంగా చేసుకుంటూ రెండు భారీ సిక్స్‌లు, ఫోర్‌తో 20 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలో వరుస బౌండరీలతో డికాక్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆఖర్లో కృనాల్ పాండ్యా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో లక్నో భారీ స్కోరు అందుకుంది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
చెన్నై	2	2	0	1.97	4
కోల్‌కతా	2	2	0	1.04	4
రాజస్థాన్	2	2	0	0.80	4
హైదరాబాద్	2	1	1	0.67	2
లక్నో	2	1	1	0.02	2
పంజాబ్	3	1	2	-0.33	2
బెంగళూరు	3	1	2	-0.71	2
గుజరాత్	2	1	1	-1.42	2
ఢిల్లీ	2	0	2	-0.52	0
ముంబై	2	0	2	-0.92	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

చికితకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పశ్చిమ బెంగాల్ వేదికగా జరుగుతున్న జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో రాష్ట్ర యువ ఆర్చర్ చికితారావు కాంస్య పతకంతో మెరిసింది. శనివారం మహిళల రికర్వ్ విభాగంలో బరిలోకి దిగిన చికిత 149 స్కోరుతో కాంస్యం కైవసం చేసుకుంది. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈ యువ ఆర్చర్..జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ ఆకట్టుకుంటున్నది.

ఏప్రిల్ ఆఖర్లో ఎంపిక

టీ20 ప్రపంచకప్ టోర్నీకి

న్యూఢిల్లీ: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీ కోసం ఏప్రిల్ ఆఖరి వారంలో భారత జట్టును ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జట్టు ప్రకటనకు ఐసీసీ మే 1ని ఆఖరి తేదీగా ప్రకటించింది. ఒకవేళ టీమ్‌లో ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలనుకుంటే మే 25వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఐపీఎల్‌తో సెంట్రల్ కాంట్రాక్టు ప్లేయర్లతో పాటు పలువురు యువ క్రికెటర్లు బిజీగా ఉన్నారు. ఏప్రిల్ నెలాఖరుకు ఐపీఎల్‌లో తొలి దశ మ్యాచ్‌లు పూర్తవుతాయి. అప్పటిలోగా క్రికెటర్ల ప్రదర్శన, ఫిట్‌నెస్, ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటూ జట్టు ఎంపిక ఉంటుందని బోర్డు వర్గాలు శనివారం పేర్కొన్నాయి.

జోరు సాగనీ..

నేడు గుజరాత్‌తో హైదరాబాద్ పోరు

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో తమదైన జోరు కొనసాగించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) పట్టుదలతో ఉంది. సొంతగడ్డపై ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించిన ఎస్ఆర్‌హెచ్..గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం తలపడనుంది. ముంబైతో మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన హెడ్, అభిషేక్‌శర్మ, క్లాసెన్ మరోమారు బ్యాటు ఝుళిపిస్తే..హైదరాబాద్‌కు తిరుగుండదు. మరోవైపు గుజరాత్ తిరిగి పుంజుకోవాలని చూస్తున్నది.

ఐపీఎల్ స్పెషల్

స్టార్క్ 8-0-100-0

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

మిచెల్ స్టార్క్..పేస్ బౌలింగ్‌కు పెట్టింది పేరు. మేటి బ్యాటర్లను తన స్వింగ్‌తో ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించిన ఘనుడు. ఫార్మాట్ ఏదైనా వికెట్ల వేట కొనసాగించడంలో ఈ ఆస్ట్రేలియా స్టార్ పేసర్ సిద్ధహస్తుడు. ఇక్కడి వరకు బాగానే ఉంది. నాణానికి మరోవైపు అన్నట్లు స్టార్క్..ఐపీఎల్ ప్రదర్శన ముక్కున వేలేసుకునేటట్లు ఉంది. అవును అసలు పేసర్లకే కరువు ఉన్నట్లు కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ గత ఐపీఎల్ వేలంలో రికార్డులు బద్దలు కొడుతూ స్టార్క్‌ను రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఎవరూ ఊహించని విధంగా మిగతా ఫ్రాంచైజీలతో పోటీపడుతూ స్టార్క్‌ను కండ్లు చెదిరే మొత్తానికి దక్కించుకుంది. ఇంత మొత్తాన్ని ఈ ఆసీస్ పేసర్ కూడా ఊహించి ఉండడు. బంపర్ లాటరీ తగిలినట్లు తొమ్మిదేండ్ల మళ్లీ ఐపీఎల్ బరిలోకి దిగిన స్టార్క్ పెట్టిన రేటుకు ఏ మాత్రం న్యాయం చేయకుండా పేలవ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ నెల 23న ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఈ లెఫ్టార్మ్ స్పీడ్‌స్టర్ నాలుగు ఓవర్లు వేసి ఏకంగా 53 పరుగులు సమర్పించుకున్నాడు. గల్లీ స్థాయి బౌలర్‌లా కనిపించిన స్టార్క్‌ను హైదరాబాద్ బ్యాటర్లు ఉతికి ఆరేశారు. తన రీఎంట్రీ మ్యాచ్‌లోనే స్టార్క్ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. కేకేఆర్ ఏరికోరి తెచ్చుకున్న బౌలర్ ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం కేకేఆర్ ఫ్యాన్స్‌కు రుచించలేదు. దీనికి కొనసాగింపు అన్నట్లు ఆర్‌సీబీతో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ స్టార్క్ 47 పరుగులు ఇచ్చి నిరాశపరిచాడు. స్టార్క్ బౌలింగ్‌లో కోహ్లీ ఆన్‌సైడ్‌లో కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. మొత్తంగా రెండు మ్యాచ్‌ల్లో 8 ఓవర్లు వేసిన స్టార్క్ ఒక్క వికెట్ తీయకుండా 100 పరుగులు ఇచ్చుకున్నాడు. ఐపీఎల్‌లో స్టార్క్ ప్రదర్శనపై సోషల్‌మీడియాలో సెటైర్లు, మీమ్స్‌కు లెక్కలేకుండా పోయింది.

లంక 314/4

బంగ్లాతో రెండో టెస్టు

ఛటోగ్రామ్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతున్నది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక తొలి రోజు శనివారం ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. బంగ్లా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ లంక బ్యాటర్లు పరుగులు కొల్లగొట్టారు. కుశాల్ మెండిస్(93), దిముత్ కరుణరత్నె (86), నిశాన్ మదుశనక (57) అర్ధసెంచరీలతో రాణించారు. మదుశనక, కరుణరత్నె..లంకకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మిడిలార్డర్‌లో కుశాల్ కూడా విజృంభించడంతో లంకకు భారీ స్కోరు వైపు అడుగులు వేస్తున్నది. హసన్ (2/64) రెండు వికెట్లు పడగొట్టాడు. దినేశ్ చండిమల్ (34), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (15) ప్రస్తుతం క్రీజులో ఉన్నారు.

మెరిసిన ప్రణీత్

మాడ్రిడ్: స్పెయిన్ వేదికగా జరిగిన ఫెజర్నెస్ స్లో బ్లిట్జ్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ ఉప్పాల ప్రణీత్ టైటిల్ విజేతగా నిలిచాడు. శనివారంతో ముగిసిన టోర్నీలో ప్రణీత్ 6/7 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచాడు. చాంపియన్‌షిప్‌లో ఓటమి ఎరుగని ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఐఎమ్‌లు గున్నార్, అక్సెల్ 5.5/7 స్కోర్లతో ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మరోవైపు టీమ్ చాంపియన్‌షిప్‌లో జీఎం ప్రణీత్, సిద్ధాంత్ మహాపాత్ర, దుష్యంత్, మోక్ష్ అమిత్‌తో కూడిన భారత బృందం రెండో స్థానంలో నిలిచింది.

సిక్కి, సుమిత్ నిష్క్రమణ

స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి జోడీ టోర్నీ నుంచి నిష్క్రమించింది. శనివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో సిక్కి, సుమిత్ ద్వయం 17-21, 12-21తో రినోవ్ రివాల్డీ, పితా హనిన్‌గ్రాస్(ఇండోనేషియా) జోడీ చేతిలో ఓటమిపాలైంది. 28 నిమిషాల్లోపే ముగిసిన పోరులో ఇండోనేషియా షట్లర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. సెమీస్ వరకు టోర్నీలో మెరుగ్గా ఆడిన సిక్కి, సుమిత్ అదే జోరు కొనసాగించలేకపోయారు.

ఫేస్ 'బుక్కవుతున్న' అమాయకులు

- తరచూ వినియోగించని అకౌంట్లే టార్గెట్
- ఖాతాలను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఆ ఖాతాల్లో అశ్లీల ఫొటోలు, వీడియోలు పోస్టు
- రీ-ఓపెన్ చేసేందుకు డబ్బులు డిమాండ్
- రిపోర్టు చేయడమే మార్గమంటున్న నిపుణులు
- టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఆన్ చేయాలని సూచన

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఇటీవల రోజూ అశ్లీల వీడియోలు, ఫొటోలు పోస్టవుతుండటంతో బంధుమిత్రులంతా ఆయనను తిట్టిపోస్తున్నారు. దీంతో కంగుతిన్న ఆ ఉద్యోగి చాలా కాలం నుంచి ఉపయోగించని తన ఖాతాను పరిశీలించగా.. నగ్నచిత్రాలు, అశ్లీల వీడియోలే కనిపించాయి. అప్పటికే తన అకౌంట్ పాస్‌వర్డ్ మారిపోయినట్టు గుర్తించిన ఆ ఉద్యోగికి రెండ్రోజుల తర్వాత ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఆ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి అశ్లీల వీడియోలు, ఫొటోలు తీసేయ్యాలంటే రూ.25 వేలు ఇవ్వాలని కాలర్లు డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా.. సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. గంటలో 30 మందితో రిపోర్టు కొట్టిస్తే ఆ అకౌంట్ బ్లాక్ అవుతుందని తెలిసినవారు సూచించారు. దీంతో ఆ ఉద్యోగి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఖమ్మానికి చెందిన ఓ రైతు సైతం ఇదే వ్యథను అనుభవిస్తున్నాడు. చాలా కాలం నుంచి ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా ఉన్న ఫేస్‌బుక్ ఖాతాలపై సైబర్ నేరగాళ్లు దృష్టిసారించి ఇలాంటి వేధింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా పాత ఫోన్‌లోని ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి లాగౌట్ కాకుండా కొత్త ఫోన్‌లోనే కొత్త అకౌంట్ క్రియేట్ చేసుకున్నవారి ఖాతాలు, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఆన్‌లో లేని ఖాతాలు, సంవత్సరాల తరబడి ఫేస్‌బుక్ డీపీలు మార్చకుండా ఉన్నవారి ఖాతాలను కేటుగాళ్లు హ్యాక్ చేయడంతోపాటు అవసరమైతే నకిలీ ఖాతాలు సృష్టించి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. ఇలా ఇటీవల ఓ బాధితుడి ఫేస్‌బుక్ ఖాతాను రీ-యాక్టివేట్ చేసేందుకు ఏకంగా రూ.50 వేలు డిమాండ్ చేశారు. కానీ, సైబర్ నేరాలపై అప్పటికే ఆ బాధితుడికి కొంత అవగాహన ఉండటంతో తన ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయిందని, అందులో అశ్లీల ఫొటోలు, వీడియోలు పెడుతున్నది తాను కాదని, రిపోర్ట్ కొట్టి ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయాలని కొత్త ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశాడు.

సమస్యలు తొలగాలంటే..

ఫేస్‌బుక్ వినియోగదారులు ఎప్పటికప్పుడు ఆ యాప్‌ను అప్‌డేట్ చేయకపోవడం, దీర్ఘకాలం నుంచి ఫేస్‌బుక్ ఖాతాను ఉపయోగించకపోవడం, డీపీని మార్చకపోవడం, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను ఆన్ చేయకపోవడం వల్లనే సైబర్ నేరగాళ్లు ఇలా రెచ్చిపోతున్నారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బలహీనమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకుంటే ఖాతాలు త్వరగా హ్యాక్ అయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. వీలైనంత వరకు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, డీపీలను తరచుగా మార్చుకోవాలని చెప్తున్నారు. ఒకవేళ ఇప్పటికే మీ అకౌంట్‌ను కేటుగాళ్లు హ్యాక్‌చేసి, డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే https://cybercrime.gov.in/ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. బెదిరింపులకు లొంగిపోయి డబ్బులు చెల్లిస్తే సైబర్ నేరగాళ్లు మళ్లీ మళ్లీ డబ్బులు అడిగి మానసికంగా హింసిస్తారని హెచ్చరిస్తున్నారు.

ఏపీలో టెట్ ఫలితాలు, డీఎస్సీ పరీక్షల వాయిదా

హైదరాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ) : ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆంధ్రప్రదేశ్‌లో టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) ఫలితాలు, డీఎస్సీ(ఉపాధ్యాయ నియామక పరీక్ష) పరీక్షలను వాయిదా వేయాలని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. ముందు ప్రకటించిన విధంగా డీఎస్సీ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు, టెట్ ఫలితాలను ఈనెల 14న విడుదల చేయాల్సి ఉంది. ఇంతవరకు డీఎస్సీ హాల్‌టికెట్లను విడుదల చేయకపోగా, 14న విడుదల చేయాల్సిన టెట్ ఫలితాలు కూడా వెల్లడికాలేదు. దీంతో అభ్యర్థులు సందిగ్ధంలో పడ్డారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారి మీనా... టెట్ ఫలితాలతో పాటు డీఎస్సీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికలు పూర్తయ్యేకే కొత్త తేదీలను ప్రకటించే అవకాశముంది.

వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి బ్రేక్

ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీలో వలంటీర్ల సేవలకు సీఈవో ముకేశ్ కుమార్ మీనా బ్రేక్ వేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయరాదని నిర్ణయించినట్లు ఆయన శనివారం ఆదేశించారు. వారి స్థానంలో నగదు పంపిణీ పథకాల్లో ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్‌లు, మొబైల్ ఫోన్లను కూడా ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయాలని మీనా ఆదేశించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.